నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 VIKARABAD

## ఓఆర్ఆర్‌పై టోల్ మోత

సిటీబ్యూరో : హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డుపై నేటి నుంచి కొత్త టోల్ చార్జీలు అమలులోకి రానున్నట్లు నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ఒక ప్రకటనలో పేర్కొంది. 158 కి.మీ విస్తీర్ణంలో ఉన్న ఓఆర్ఆర్‌పై 21 ఇంటర్‌చేంజ్ వద్ద ఐఆర్‌బీ టోల్ చార్జీలను వసూలు చేస్తున్నది. కొత్త చార్జీలను ఏప్రిల్ 1 నుంచి వసూలు చేయనుండగా.. కారు నుంచి మొదలుకొని భారీ వాహనాల వరకు కిలోమీటర్‌కు రూ.2 నుంచి రూ.15.78 చొప్పున అదనంగా వసూలు చేయనున్నది. పెరిగిన ధరలపై ప్రకటన విడుదల చేయడంతో మంత్లీ, డైలీ పాసుల ధరలూ మారనున్నాయి.

| మారిన కొత్త చార్జీలు (కి.మీ) చొప్పున | |
|---|---|
| కారు | రూ.2.44 |
| మినీ బస్ | రూ.3.94 |
| బస్సు, ట్రక్కు | రూ.7.00 |
| కమర్షియల్ ట్రక్కు | రూ. 9.01 |
| భారీ, నిర్మాణ వాహనాలు (12 టైర్స్) | రూ. 12.96 |
| 14 టైర్స్ పైబడి ఉండే వాహనాలు | రూ. 15.78 |


## వెయ్యి ఫీట్లు వేసినా

# నీళ్లు రావట్లే..

**తగ్గుతున్న భూగర్భ జలాలు.. వట్టిపోతున్న బోరుబావులు**

- సరిపడా నీరందక ఎండుతున్న పంటలు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 200 ఫీట్లకే పుష్కలంగా నీళ్లు

రంగారెడ్డి, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దీంతో బోరుబావులు అడుగంటి పెద్ద ఎత్తున పంటపొలాలు ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు కొత్తగా బోర్లను తవ్విస్తున్నా.. మరోవైపు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా సరిపోవడంలేదు. కాగా జిల్లాలో సుమారు 50 శాతానికిపైగా బోర్లు వట్టిపోయి.. వాటి కింద ఉన్న పొలాలు ఎండిపోతున్నాయి.



బోరులో నీళ్లు లేక ఎండిన పొలం

### నాడు 200 ఫీట్లకే నీరు..

జిల్లాలో గత బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ కింద చెరువులు, కుంటల్లో పూడికతీతతోపాటు.. కాల్వలకు మరమ్మతులు చేపట్టడంతో వర్షాకాలంలో వచ్చిన నీటితో చెరువులు, కుంటలు కళకళలాడేవి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటల్లోకి నీరొచ్చే కాల్వల మరమ్మతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వర్షం నీరు చెరువులు, కుంటల్లోకి చేరక ఎండిపోతున్నాయి.

గతంలో జిల్లాలోని గ్రామీణ మండలాల్లో 200 ఫీట్లు వేస్తే నీరు సమృద్ధిగా వచ్చేది. కానీ, ప్రస్తుతం నీటిమట్టం తగ్గిపోవటంతో 800 నుంచి 1000 ఫీట్ల వరకు బోర్లు వేసినా నీరు రాని పరిస్థితి ఏర్పడింది. గతంలో బోర్లు వేస్తే రూ.50,000 వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం ఒక్క బోరు వేయాలంటే రూ.1,00,000 పైగానే ఖర్చవుతున్నది. అందుకు అన్నదాతలు అప్పులు చేస్తున్నారు.

### రెండెకరాలకు నాలుగు బోర్లు



నాకు రెండెకరాల పొలం ఉన్నది. అందులో వరితోపాటు ఇతర తోటలను సాగు చేశా. అందుకోసం రూ. మూడు లక్షలు ఖర్చు చేసి మూడు బోర్లు వేయించా. ఆ బోర్లు మొత్తం వట్టిపోయి వేసిన వరి పంట ఎండుముఖం పట్టింది. ఉన్న పంటను కాపాడుకునేందుకు మరో బోరును తవ్వించగా.. అంతంత మాత్రంగానే నీరు వచ్చింది. బోరు, బోరుమోటర్ కోసం మరో రూ. రెండు లక్షల వరకు ఖర్చు అయింది. ఆ నీటితో పంటను పండించేందుకు తీవ్రంగా కష్టపడుతున్నా. **-వెంకట్‌రెడ్డి, రైతు, చిత్తాపూర్, మంచాల**

### నాలుగు బోర్లు తవ్వించినా చుక్క నీరు లేదు..



నాకు ఎనిమిది ఎకరాల పొలం ఉండగా.. అందులో నాలుగు బోర్లు తవ్వించా. అయినా బోర్లు వట్టిపోయి వరి పంట ఎండిపోయింది. ఒక్క బోరులోనూ చుక్క నీరు రాలేదు. అప్పులే మిగిలాయి.

**- జెనిగ సత్తయ్య, తిప్పాయిగూడ**



పొలం ఎండుముఖం పట్టడంతో బోరును తవ్విస్తున్న రైతు

# మంత్రి పదవి ఇవ్వాల్సిందే..

**రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీకి అధిష్ఠానం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటివరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంత్రివర్గంలో స్థానం లేనందున ఈసారి మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెంచుకున్నారు. అందులో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మొదటి స్థానంలో ఉన్నారు. కాని, అధిష్ఠానం నుంచి సానుకూల సంకేతాలు లేకపోవటంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలంతా (కాంగ్రెస్ పార్టీ) ఒక నిర్ణయానికొచ్చారు. తమలో ఎవరికి అవకాశమిచ్చినా అందరం సర్దుకుంటామని కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజికవర్గమే అడ్డనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభ్యర్థిని నిలిపి గెలిపించుకుని తీసుకువస్తానని.. ఆయనకైనా మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని ఇప్పటికే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే తాను రాజీనామా చేస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి ఇప్పటికే బాహాటంగా తన నిర్ణయాన్ని ప్రకటించారు.**

**- రంగారెడ్డి, మార్చి 31 (నమస్తే తెలంగాణ)**

- ఎవరికైనా సరే అంటూ.. ఎవరి ప్రయత్నాల్లో వారున్న రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు
- స్వరం పెంచిన మల్‌రెడ్డి
- తామూ పోటీలో ఉన్నామంటున్న మహేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్
- మరో రెండు రోజుల్లో తేలనున్న భవితవ్యం



గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 స్థానాల్లో ఐదు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో మల్‌రెడ్డి రంగారెడ్డి(ఇబ్రహీంపట్నం), ప్రసాద్‌కుమార్(వికారాబాద్), రామ్మోహన్‌రెడ్డి(పరిగి), మనోహర్‌రెడ్డి(తాండూరు), వీర్లపల్లి శంకర్(షాద్‌నగర్) ఉన్నారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లా నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ పదవి దక్కింది. కాని, రంగారెడ్డి జిల్లాలో ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదు.

### అధిష్ఠానానికి లేఖ రాసిన ఎమ్మెల్యేలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి వచ్చి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతున్నారు. ఈ మేరకు తమలో ఎవరికైనా ఒకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ.. ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్‌తోపాటు బీఆర్ఎస్ నుంచి గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య తదితరులు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు కూడా లేఖ రాశారు.

### ఎవరికి వారే..?

మరో రెండు మూడు రోజుల్లో రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించేందుకు అధిష్ఠానం ఆదేశాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఆయన గవర్నర్‌ను కూడా కలిసి మంత్రివర్గ విస్తరణ గురించి తెలియజేసినట్లు తెలిసింది. మల్‌రెడ్డితోపాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సైతం తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనందున మంత్రివర్గ విస్తరణలో తనకు కూడా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అలాగే, బీసీ కోటా నుంచి అవకాశం వస్తే తమ సామాజిక వర్గం నుంచి ఎక్కడా ప్రాతినిథ్యం లేనందున తనకే ఇవ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం కోరుతున్నట్లు తెలిసింది. అలాగే, చీఫ్ విప్ పదవిలో ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఎవరికున్న మార్గాల్లో వారు మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుండగా.. మరో రెండు రోజుల్లో భవితవ్యం తేలనున్నది.

# బతుకు గడిచేదెట్లా..?

ఆరుగాలం కష్టపడి నాటిన వరి కండ్ల ముందే ఎండిపోతుంటే అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు నీటిని పోయడంలేదు. పంటను కాపాడుకోవాలన్న ఆతృతతో రూ.లక్షల్లో ఖర్చు చేసి బోర్లు వేసినా చుక్క నీరు కూడా రావడంలేదు. ఎండిన వరి పంటల్లో పశువులను మేపుతున్నారు. పంట పెట్టుబడికి మిత్తీకి అప్పు తెచ్చి ఎలా తీర్చాలో తెలియక అయోమయంలో పడిపోతున్నారు. సర్కారు పెట్టుబడి సాయం కూడా అందించలేదు. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు పేర్కొంటున్నారు. - కొత్తూరు, మార్చి 31

- అందని పెట్టుబడి సాయం
- మిత్తీకి తెచ్చి చిత్తవుతున్న అన్నదాతలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- లక్షలు ఖర్చు చేసి బోర్లు వేసినా ఫలితం శూన్యం
- ఎండిన వరి పంటలో పశువులను మేపుతున్న రైతులు

### 3 బోర్లు వేసినా నీళ్లు రావట్లే..

కొత్తూరు మండల పరిధిలోని పులిచెర్లతండాకు చెందిన లంబాడా రైతు పుల్యానాయక్ ఒక ఎకరంలో వరి వేశాడు. అందుకోసం రూ.60 వేలు పెట్టుబడి పెట్టాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నుంచి నీరు క్రమంగా తగ్గిపోయింది. పంటను ఎలాగైనా కాపాడుకోవాలని 50 వేలు ఖర్చు చేసి ఓ బోర్ వేయించాడు. చుక్క నీరు కూడా రాలేదు. మరో 50 వేలు ఖర్చు చేసి మరో బోర్ వేయించాడు. మళ్లీ నిరాశే ఎదురయింది. పట్టువదలని విక్రమార్కుడిలా మూడో బోరు వేయించాడు. అయినా చుక్క నీరురాలేదు. అప్పు మొత్తం రూ.లక్షన్నరకు చేరింది. పెట్టుబడితోని కలుపుకొంటే మొత్తం రూ.2లక్షల10వేలకు చేరింది. ఎండిన వరిలో ఎండ్లను మోపాల్సిన పరిస్థితి వచ్చిందని పుల్యా నాయక్ వాపోతున్నాడు. అప్పు తీరాలంటే భూమి అమ్ముకోవాలి.. లేదంటే ప్రభుత్వం ఆదుకోవాలఅంటున్నాడు. లేకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్నాడు.





బోరు బావిని చూపిస్తున్న పుల్యానాయక్, అతడి కుమారుడు మహేశ్‌నాయక్.. ఎడ్లకు మేతగా ఎండిన వరి చేను

### ఎండిన వరిలో ఎడ్లను మేపుతున్నాం



మూడు బోర్లు వేసినా చుక్కనీరు పడలే. ఉన్న వరిచేను ఎండిపోయింది. అప్పు మీద పడింది. ఎండిన చేనులో ఎడ్లు మేపుతున్నాం. మా పరిస్థితి దయనీయంగా మారింది. అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. పరిస్థితులు ఇలాగే ఉంటే నా భర్త, నేను, నా కుమారుడు మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవాల్సిందే. ప్రభుత్వం మమ్ములను ఆదుకోవాలి.

**- జంబీ, పులిచెర్లతండా, కొత్తూరు మండలం**

## ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యం దాటి కలెక్షన్లు

**రూ.2012.36 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్న బల్దియా**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని అధిగమించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు రూ.2012.36 కోట్ల ఆదాయం వచ్చినట్లు కమిషనర్ ఇలంబర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ చరిత్రలోనే మొదటిసారి 14 లక్షల మందికి పైగా పన్నులు చెల్లించడం ద్వారా ఆదాయం రూ.2వేల కోట్లు దాటిందని తెలిపారు. కాగా గత నెల 7వ తేదీన బకాయిదారులకు ప్రభుత్వంవన్ టైం సెటిల్‌మెంట్ స్కీం అవకాశం కల్పించగా.. ఓటీఎస్ రూపంలో రూ.465 కోట్ల వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా చివరి ఒక్కరోజే రూ.115 కోట్ల పన్ను వసూలైందని అధికారులు చెప్పారు. అదనపు కమిషనర్ అనురాగ్ జయంత్, చీఫ్ వాల్యుయేషన్ అధికారి (సీవీఓ) కులకర్ణి, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లను కమిషనర్ అభినందించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1917 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలైంది. అర్ధరాత్రి 11 గంటల వరకు చెల్లింపులకు సమయం ఉందని, మంగళవారం ఆస్తి పన్ను వసూళ్ల లెక్కను సమగ్రంగా వివరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.





# మాకు రైతు భరోసా ఇవ్వరా?



ఔటర్ రింగు రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల రైతుల ఆవేదన

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రైతు భరోసా ఇచ్చింది రూ.6 కోట్లే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది రైతుబంధు రూ.33 కోట్లు

>IVలో

## నాడు.. నేడు

బీఆర్ఎస్ హయాంలో కళకళలాడిన పల్లె ప్రకృతివనాలు





కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎండిపోయిన పల్లె ప్రకృతివనాలు





## నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం

బీఆర్ఎస్ హయంలో పల్లె ప్రకృతి వనాల్లో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించడం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి.. నాటిన మొక్కలు ఏపుగా పెరిగేంత వరకు కృషిచేశారు. దీంతో ప్రకృతి వనాలు ఆహ్లాదాన్ని పంచాయి. కాని, ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పల్లె ప్రకృతి వనాలను గాలికొదిలేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నాడు ఆహ్లాదాన్ని పంచిన ప్రకృతి వనాలు నేడు కళా విహీనంగా మారాయి. అక్కడక్కడ అగ్ని ప్రమాదాలతో కాలి బూడిదైపోతున్నాయి. - ఇబ్రహీంపట్నం